# మీసాయణం

ఆరు అడుగుల ఎత్తు, ఎత్తుకు తగిన లావు..,

విశాలమైన ఛాతీ, కొనదేరిన ముక్కు, ఇట్టే ఆకర్షించుకోగల రూపం..,

ఏ యువతి చూసినా– 'ఇతని గుండెల్లో నిదురపోని బ్రతుకెందుకు? అని అనుకోకమానదేమో...' అనిపిస్తుంది.

అతనే మా అర్జునరావు...

మా ఆఫీసులో ఉద్యోగి !

అయితే– అతనిలో ఒకే ఒక్క లోపం గోచరించింది మాకు.

అతనికి మీసాలు లేవు. గుబురుగా ఉంచాల్సిన మీసాల గ్రౌండ్‌ని ఎప్పుడూ నున్నగా వుంచుతాడు.

అతను గుబురుమీసాలు పెంచితే ఎంతో బాగుంటుందని మాతో పాటుగా తోటి స్త్రీ ఉద్యోగులు కూడా అనుకోవడం, మేము వినడం కూడా జరిగింది.

'ఈ మా కోరిక అతనికి తెలియచేస్తే ఎలా వుంటుంది? ఒకవేళ అతనేమైనా ఫీలవుతాడా?' అనేది సమస్య అయ్యింది.

చివరకు అర్జునరావుకి ఈ విషయం నేనే చెప్తానన్నాను.

మేము అందరం లంచవర్‌లో కూర్చునివుండగా, అర్జునరావు మాతో సరదాగా కబుర్లు చెప్తున్న సమయంలో–

"అర్జునరావుగారూ... మాదో చిన్న మనవి!" అన్నాను.

"మనవి అంటున్నారు... ఏమిటి విశేషం?! వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ?" అన్నాడు నవ్వుతూ.

అతను నవ్వుతున్నప్పుడు– 'ఆ పెదాల పైన గుబురు మీసాలు వుంటే ఎంత బాగుండేది?' అనిపించింది మాకు. అందరికీ త్వరలో ఆ సుందర దృశ్యం చూడాలని ఆరాటంగా వుంది.

"మీరు మీసాలు ఎందుకు పెంచరు?" అన్నాను.

అనుకోకుండా వచ్చిన ఆ ప్రశ్నకు అతను కొంచెం ఆశ్చర్యపోయి– "ఎందుకండీ మీసాలు పెంచడం? వాటిని పెంచడం వలన చాలా అనర్థాలు వున్నాయి."

"ఏమిటో..?!"

"ఏముందీ... పెంచాక అవి ఏ ఫ్యాషన్‌లో పెంచాలని ఒక గొడవ! షేవింగ్ చేసుకునేటప్పుడు చాలా జాగ్రత్తగా చేసుకోకపోతే అటు ఎక్కువయిందని ఇటూ, ఇటు ఎక్కువయిందని అటూ... ఒక్కోసారి రెండువైపులా గొరిగెయ్యడం జరుగుతుంది. బోడి ముఖంతో ఆఫీసుకు వెళితే "ఏం గురూగారూ... రాత్రి ఏదైనా నాటకం వేశారా?" అని అందరూ అడగడం! ఇలా ఎన్నో గొడవలు లెండి... ఎందుకొచ్చిన గొడవ!" అన్నాడు.

అతను చెప్పిన కారణాలు సబబుగా వున్నా సరే- మా ప్రయత్నం విరమించుకో దలచుకోలేదు.

"మీరు మీసాలు పెంచండి... వాటి పోషణ భారం, వాటి స్టయిలు వగైరాలు మేము చూసుకుంటాం! వుయ్ మీన్ట... మీకు ఏం స్టయిలు బాగుంటుందో సెలెక్టు చేద్దాం. మీరు మీసాలు పెంచుకుంటే ఎంతో బాగుంటారు!" అని ఆయనపై వొత్తిడి తెచ్చాం ఆయన 'మీసాల పోషణ' అంటే... షేవింగ్ మాత్రం కాదు సుమా!

ఎలాగో ఆయన ఈల్డ్ అయినట్లే అనిపించింది.

"సర్లెండి... చూద్దాం!" అన్నారాయన.

అంతే... బుంగమీసాలతో అర్జునరావు ముఖారవిందాన్ని వెలవెల ఊహించుకో సాగాము మేము.

మా ఆశలకు అనుగుణంగా -

మా సూచన మేరకు -

మర్నాడు ఆయన షేవింగు మాత్రం చేసుకుని, మీసాల గ్రౌండ్‌ని ఫ్రీగా వదిలేసి వచ్చాడు. ఆయన ముక్కుకింద నల్లని చారలు ఎంతో అందంగా వున్నాయి. ఆయనకు దట్టంగా మీసాలు వస్తే ఇంకెంత బాగుంటుందో!

యూరియా, బాగా మాగిన పశువుల పెంట వేసి, తరచు కలుపుమొక్కలు పెకిలివేస్తున్న పైరులా... అర్జునరావు మీసాలు రోజురోజుకీ దట్టంగా పెరిగిపోయాయి.

అప్పటివరకు వాటికి పైకి రావడానికి అవకాశం ఇవ్వక అస్వతంత్రంగా అణచివేయ బడటం వలన- ఒక్కసారిగా అవి... అనగా అర్జునరావు మీసాలు విజృంభించి అడవి పంది వంటిపై వెంట్రుకల్లా ఆయన మీసాల గ్రౌండుపై నిక్కబొడుచుకున్నాయి.

ఒకరోజు మేమందరం లంచ్‌లో వుండగా...

"ఏమిటోట... మీసాలు పెంచమన్నారు! ఇవి చూడండి- అస్తవ్యస్తంగా ఎలా పెరుగుతున్నాయో?!" అన్నాడు అర్జునరావు.

అప్పుడు మాలో ఒకాయన "అర్జునరావుగారూ! మీరేమీ గాబరా పడకుండా, ఇంకొన్ని రోజులు పెరగనిచ్చి ఇంటి దగ్గర ఆముదం రాసి, చిన్నదువ్వెనతో రెండు పక్కలకూ దువ్వండి. అప్పుడప్పుడు చేతివేళ్ళతో అటూఇటూ మీసాలు సవరించుకుంటూ వుండండి!" అన్నాడు.

మర్నాటినుంచి ఆయన మీసాలు అటూఇటూ అణిగి ఆయన ముఖానికి ఎంతో అందాన్నివ్వసాగాయి. ఇకపోతే ఆయన రెండుచేతుల్లో ఏదో ఒక చెయ్యి మాత్రం మీసాలపై నాట్యం చేస్తోంది. అస్తవ్యస్తంగా పెరిగిన ఆయన మీసాలు చేతివేళ్ళతో దువ్వుతుంటే ఇప్పుడిప్పుడే ఒక దారికి వచ్చి గుబురుగా తయారవుతున్నాయి.

అర్జునరావు మీసాలు దువ్వుతున్నాడు.

ఇంటి దగ్గర నుంచి టెలిగ్రామ్ వచ్చింది... అర్జెంటుగా రమ్మని! శెలవు చీటీతో పాటు టెలిగ్రామ్ తీసుకుని ఆఫీసరుగారి గదిలోకి వెళ్లాడాయన.

"సర్..."

"ఏమిటి?"

"ఇంటికి... శెలవు..."

"ఇంటికి శెలవు- ఏమిటయ్యా... సరిగ్గా చెప్పు!"

"ఇంటి దగ్గరనుంచి నన్ను రమ్మని టెలిగ్రామ్ వచ్చిందండీ!"

"అయితే ఎన్నిసార్లు శెలవు పెడతావ్? ఇప్పటివరకూ చచ్చిపోయినవాళ్ళందర్నీ మళ్లీ మళ్లీ చంపి ఎన్నోసార్లు శెలవు పెట్టి వెళ్లావ్. అయ్ కెనాట్ శాంక్షన్ ది లీవ్!"

"ఈ ఒక్కసారి..."

"నో! యూ కెన్ గో ఇన్ ది ఎన్న్యూయింగ్ హాలీడేస్!" అని ఆయన తలెత్తి అర్జునరావు ముఖంవైపు చూశారు.

అర్జునరావు చెయ్యి విడిచి, మరో చేత్తో అవిశ్రాంతంగా మీసాలు దువ్వుతున్నాడు.

'ఏమిటీ... వీడు నన్ను బెదిరిస్తున్నాడా? లీవ్ శాంక్షన్ చేయకపోతే నీ అంతం చూస్తానంటున్నట్లుగా మీసాలు దువ్వుతున్నాడా?' అని ఆయనకు అనుమానం వచ్చింది.

"అర్జునరావ్... యూ కెన్ గో!" అన్నారాయన.

జనరల్‌గా ఆఫీసర్‌గారు ముందు 'నో...' అన్నా సరే- తరువాత 'యస్' అంటారు. అందుకని అర్జునరావ్ మీసాలు దువ్వుకుంటూనే నిలబడ్డాడు.

ఆ 'మీసాలు దువ్వుడు' చూస్తుంటే... ఆఫీసరుగారికి మండిపోతోంది!

కాలింగ్ బెల్ నొక్కాడు...

అటెండర్ వచ్చాడు.

"ఇతన్ని బయటకు పంపించు! లీవ్ శాంక్షన్ చెయ్యనంటే మీసాలు దువ్వుతున్నాడు. ఎస్టాబ్లిష్ క్లర్క్‌ని పిలుచుకురా... ఇతని విషయం మాట్లాడతాను. అయ్ హేవ్ టు టేక్ డిసిప్లినరీ యాక్షన్!" ఆయన గర్జించారు.

ఆ దెబ్బతో అర్జునరావు వేలాడుతున్న ముఖంతో బయటకు వచ్చాడు.

సంగతి తెలిసి మేమందరం మూకుమ్మడిగా వెళ్లి ఆఫీసరుగారికి అసలు సంగతి చెప్పి, మీసాలు క్రొత్తగా పెంచడం వలన ఇలా జరిగిందని వివరించాము.

ఈ సంఘటన జరిగాక అర్జునరావు మీసాలు తీసేస్తానన్నాడు.

"మీసాలు కుదురుగా పెరిగాక మీసాల పైన చెయ్యి వేసే పనేముంది?" అని నచ్చచెప్పాము మేమందరం.

అర్జునరావు ఊరు వెళ్లాడు.

ఆయన లేక మాకు ఆఫీసు చిన్నబోయింది! ఎందుకంటే... ఆయన 'మీసాల పెంపు' వలన ఎదుర్కొనే అనుభవాలు చెప్తుండేవాడు.

●

నాలుగు రోజుల తరువాత అర్జునరావు ఊరి నుండి వచ్చాడు.

ఆయన్ని చూసి మేమంతా ఆశ్చర్యం, ఆందోళన చెందాము.

కారణం...

ఆయన తలకు కట్టు, కాళ్లకు, చేతులకు కట్లు! నడవ లేని స్థితిలో వచ్చాడు రిక్షాలో. శెలవు పొడిగిస్తే ఆఫీసరుగారు కేకలేస్తారని అలాగే వచ్చేశాడట!

"ఏం జరిగిందండీ..." అనడిగాము అందరం ఒకేసారి.

"ఏం జరగడమేమిటండీ బాబూ... ఈ మీసాలు నా కొంప ముంచాయి!" అన్నాడు.

"ఏం లేదు... మీరు గాబరా పడకండి! మీసాలు అలవాటైపోతే అదేమీ వుండదు!" అని నచ్చజెప్పాము.

అసలేం జరిగిందంటే...

వాళ్ళ ఊళ్లో పేరుమోసిన నలుగురు దాదాలు వున్నారు. ఆరోజున వాళ్ళు తమ శత్రుబృందాన్ని చితకబాది తమకు ఆ ఊళ్లో తిరుగులేదనే ధీమాతో వస్తున్నారు.

వాళ్ళకు ఎదురుగా అర్జునరావు నడుస్తున్నాడు.

వాళ్ళను గమనించలేదేమో... మనవాడు మామూలుగా 'మీసాలు దువ్వుడు' మొదలుపెట్టాడు.

"ఏంది బే... మమ్మల్ని చూసి మీసాలు దువ్వుతావా?" అని అందరూ మీదపడి షిఫ్ట్ వేసుకుని ఉతికేశారు.

"కాదండీ... నేను మీసాలు పెం..." అనే అర్జునరావు మాటలు నోట్లోనే ఉండిపోయాయి.

●

"ఇక మీసాలు తీసేస్తానండీ. ఇవెప్పుడో నా ప్రాణాలు బలిగొంటాయి!" అంటూ బావురుమన్నాడాయన.

"ఛ... అలా బెదిరిపోకండి! మీసాల మీద చేతులు తీసేసి బలవంతంగా చేతులు బిగపట్టుకుని వుండండి!" అని సలహా చెప్పాము.

ఇలా రోజులు గడుస్తున్నాయి...

●

ఇంతలో- మా ఊళ్లో కుస్తీపోటీలు వచ్చాయి.

'కుస్తీ పోటీ' అంటే మా అందరికీ భలే ఇష్టం!

దేశ ప్రఖ్యాతి గాంచిన ఇద్దరు మల్లయోధులు గోదాంలో వున్నారు.

ఒకరిపైన ఒకరు సవాల్ చేసుకుంటూ, తొడలు చరుచుకుంటూ 'కాసుకో, కాసుకో..!' అని అరుచుకుంటున్నారు.

అదే సమయంలో మేము వెళ్లి ముందువరుసలో కూర్చున్నాము.

కుస్తీ పోటీ మొదలైంది!

చాలాసేపు ఒకరినొకరు పట్టుపట్టడం, విడిపించుకోవడం జరిగింది. ఒక వస్తాదు మరో వస్తాదుని రెండుసార్లు క్రిందపడేస్తే... ఇంతే సంగతులు- వోడిపోయినట్లే!

మూడో రౌండ్ చాలా ఉద్రేకంగా జరిగింది. మూడోసారి వస్తాదుని క్రిందపడేశాడు. ఒక వస్తాదు గెలిచాడు.

కాసేపటివరకు బోర్లాపడినవాడు లేవలేదు. లేచినా బాగుండేది.

గెలిచిన మల్లయోధుడు గోదాం చుట్టూ కట్టిన తాడు పట్టుకుని చుట్టూ ప్రదక్షిణం చేస్తూ... "రండి ఎవరైనా వుంటే! వీడిని వోడించలేనని ఈ ఊళ్లో పందెం కట్టారుట... బస్తీమే సవాల్!" అని అరుస్తున్నాడు.

నిజం చెప్పొద్దూ... ఆ గెలిచిన వస్తాదు మీసాలు బొద్దింక మీసాలు- బహు ముచ్చటగా వున్నాయి.

అర్జునరావుకు కూడా తన మీసాలు గుర్తుకువచ్చినట్లున్నాయి. ఒక్కసారి తన మీసాలపై చెయ్యి వేశాడు.

అంతే... ఇంకేముందీ?

గెలిచిన వస్తాదు తాడు మీద నుంచి ఒక్క దూకు దూకి- తిన్నగా అర్జునరావు దగ్గరకు వచ్చి అతన్ని ఒకేసారి బియ్యంబస్తాలా పైకి ఎత్తి గోదాలోకి తీసుకెళ్లి క్రిందపడేశాడు.

"ఏరా... నన్ను చూసి మీసం దువ్వుతావా? రా... తేల్చుకుందాం... రా!" అని అరుస్తుంటే... అర్జునరావు లేవటం లేదు.

మేమందరం లేచి- వస్తాదుని శాంతింపచేసి, అర్జునరావు దగ్గరకు వెళ్లి చూస్తే-

ఏముందీ...

స్పృహలో లేడు అర్జునరావు.

వెంటనే అతన్ని హాస్పటల్‌కి తరలించాము.

తరువాత అర్జునరావు తిరుపతి మొక్కబడి మూలాన్న తలపైన, మీసాల గ్రౌండ్ లోనూ ఒక్క వెంట్రుక లేకుండా చేసేసుకున్నాడు.

●

'శ్రీవాణి' మాసపత్రిక ... ఫిబ్రవరి' 1985 సంచికలో ప్రచురితం